క్లుప్తంగా

బైకులు ఢీ.. యువకులకు గాయాలు

ఉండవెల్లి: మండల కేంద్రం, కంచుపాడు రహదారి మధ్యలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొట్టిన ఘటనలో కంచుపాడుకు చెందిన ఇద్దరు యువకులకు గాయపడిన ఘటన బుధవారం జరిగింది. మండల కేంద్రం నుంచి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తు తెలియని వ్యక్తి ఉండవెల్లికి వస్తున్న క్రమంలో బైక్‌తో ఢీకొట్టి పరారైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో కంచుపాడుకు చెందిన రాంబాబు తీవ్రంగా గాయపడగా, ప్రవీణ్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

నామినేషన్ల స్వీకరణ

గద్వాల: గద్వాల బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే ప్రక్రియలో భాగంగా బుధవారం అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి గడ్డం రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

మానవపాడు: గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచి అందరికీ ఉపాధి కల్పించాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని బోరవెల్లి, అమరవాయి, మానవపాడు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల శాతం పెంచాలని తెలిపారు. గ్రామాల్లో నర్సరీలకు నీటి సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆర్థిక సాయం



అయిజ: మండలంలోని సంకాపురం ప్రభుత్వ పాఠశాలకు బీఆర్ఎస్ నాయకుడు రాముడు రూ.60 వేలు ఆర్థిక సాయం చేశారు. బుధవారం హెచ్‌ఎం విజయకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ.. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యా వలంటీర్లకు గౌరవ వేతనం అందజేసేందుకు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'108' సేవలు వినియోగించుకోవాలి

అలంపూర్: ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర క్వాలిటీ అడిటర్ కిషోర్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 108 అంబులెన్స్‌లను కోఆర్డినేటర్ రత్నయ్యతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. మానవపాడు, అలంపూర్, ఉండవెల్లి 108 అంబులెన్స్‌ల రికార్డులు, మందులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఎంటీ రాధామోహన్, రేణుక, శేఖర్, శివ, పైలెట్ కృష్ణ, రవి, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు ఎంపిక

ఎర్రవల్లి: మండల పరిధిలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ఉపాధ్యాయురాలు గౌరీ రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీరెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు ఢిల్లీలో జరుగనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు గౌరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖరయ్య, సరిత, అబ్దుల్ మజీద్, హబీబాబేగం, వెంకటేశ్వరమ్మ, భారతి, సైరాబాను తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్

ఉండవెల్లి: మండలంలోని ఆశా కార్యకర్తలు తమ డిమాండ్లను పరిష్కరించేందుకు కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న నేపథ్యంలో ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలక పరిధిలోని శాంతినగర్ పెద్ద మస్జిద్‌లో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు స్థానిక వ్యాపారి షాబాద్ శాలి పైల్వాన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రజాక్, కలీముల్లా మౌలానాలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

- నిరుపయోగంగా వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు
- ప్రారంభానికి నోచుకోని వైనం
- నివాసగృహాల మధ్య శ్మశానవాటికలతో ఇబ్బందులు



చెన్నిపాడులో నివాసగృహాల మధ్యన ఉన్న శ్మశానవాటిక

మానవపాడు: గత ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్ల ఏర్పాటుకు పూనుకుంది. అలంపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 124 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు నిర్మించగా పూర్తి స్థాయిలో నిరుపయోగంగా మారాయి. సెగ్రిగేషన్



అమరవాయిలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

షెడ్లది సైతం ఇదే పరిస్థితి ఏర్పడింది. చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభనికి నోచుకోలేదని విమర్శిస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా..

అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు, అలంపూర్, ఎర్రవల్లి, ఇటిక్యాల, అయిజ, రాజోళి, వడ్డెపల్లి, ఉండవెల్లి గ్రామాల్లో మొత్తం 124 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతి గ్రామ పంచాయతీలో వైకుంఠధామాల నిర్మాణాలకు 2019లో గత తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్కో వైకుంఠధామానికి పీఆర్‌శాఖ నుంచి రూ. 12.60 లక్షలు, సెగ్రిగేషన్ షెడ్లకు ఈజీఎస్ ద్వారా నిర్మించిన వాటికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లోని వైకుంఠదామాలు నిర్మించి నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో నాసిరకంతో నిర్మించడంతో గోడలకు బీటలు వారుతున్నాయి. చుట్టూ చెట్లు పెరిగి కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైకుంఠదామాలు, సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాడుకలోకి తీసుకురావాలి..



ప్రభుత్వం వైకుంఠ ధామాలను వాడుకలోకి తీసుకురావాలి. చాలా గ్రామాల్లో నివాసగృహల మధ్య శ్మశాన వాటిక వలన ఇబ్బందులు పడుతున్నాం. సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

–బజారన్న, మానవపాడు

సౌకర్యాలు కల్పించాలి..



వైకుంఠదామాల్లో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలి. వైకుంఠ ధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్వహణ లేక వదిలేశారు. ప్రభుత్వం చొరవ చూపి వినియోగంలోకి తేవాలి.

–యుగంధర్, చెన్నిపాడు

సమస్యలు పరిష్కరిస్తాం..

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, తదితర సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిరుపయోగంగా ఉన్న వాటిని పరిశీలించి మరమ్మతులు చేపడుతాం. సెగ్రిగేషన్ షెడ్లు వాడుకలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

–నాగేంద్రం, జిల్లా పంచాయతీ అధికారి

బీసీ, ఎస్సీ బిల్లుల ఆమోదంపై హర్షం



గట్టులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ధరూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గట్టు/ధరూరు/కేటీదొడ్డి: బీసీ రిజర్వేషన్లతో పాటు ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలుపుతూ అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవడంపై గట్టు మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్రం రెండు బిల్లులను ఆమోదించాలని వారు కోరారు. కార్యక్రమంలో మహబూబ్‌పాషా, కృష్ణ, వెంకటస్వామిగౌడ్, బాలకృష్ణ, బజారి, వసంత్, హుస్సేన్, నల్లారెడ్డి, రఫీ, హనుమంతు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

★ ధరూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీఆర్ శ్రీధర్, కుర్వ శ్రీను, చింతరేవుల సురేష్‌ల నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కపట్రాల వెంకట్‌రెడ్డి, రంగస్వామి గౌడ్, ప్రహ్లాద్, జంగిలప్ప, రఘు, పరుశరాముడు, రాము, గోవింద్, పెద్ద సవారన్న తదితరులు పాల్గొన్నారు.

★ కేటీదొడ్డి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీసీ, ఎస్సీ బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆనంద్‌గౌడ్, శ్రీను, మైబు, సురేష్, జంగిలప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే వర్గీకరణ బిల్లు ఆమోదం



అలంపూర్‌లో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సంబురాలు



రాజోళిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దండోరా నాయకులు

అలంపూర్: ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగానే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఏకగ్రీవంగా అమోదం లభించిందని ఎంఈఓఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రాజ్యంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బాబాసాహేబ్, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పించారు. 70 ఏళ్ల కలను సాకారం చేసిన మందకృష్ణ మాదిగకు జాతి ఎల్లప్పుడు రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు వందనమయ్య, మద్దిలేటి మాదిగ, జగ్గీవన్ మాదిగ, రామకృష్ణ, మత్తయ్య, దాసన్న, సోమన్న, వెంకటేశ్వర్లు, కృష్ణ, బాబు, భాస్కర్, మహేష్, సురేష్, సుంకన్న, జీవరత్నం, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగ ఫలితమే వర్గీకరణ

రాజోళి: ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాడి అసువులు బాసిన వారి కారణంగానే నేడు ఫలితం దక్కిందని ఎమ్మార్పీస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో భాస్కర్, లక్ష్మన్న, దేవన్న తదిదరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



పాతపాలెంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ధరూరు : మార్లబీడు సెంటర్‌లో సౌకర్యాలపై చర్చిస్తున్న అధికారులు

ధరూరు/కేటీదొడ్డి/గట్టు: పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి రవీంద్రబాబు తెలిపారు. 21 నుంచి జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు మండలంలో ధరూరు, మార్లబీడు, ఉప్పేరు మొత్తం మూడు సెంటర్లకు గాను మొత్తం 754 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు సందర్శించి కార్యదర్శులతో చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

★ కేటీదొడ్డి మండలం పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ శివశంకర్ పరిశీలించారు. పది పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

దాతల ఔదార్యం అభినందనీయం



అయిజ: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యాపదిన్నెలో జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పకీరన్న, సిద్దయ్య, అబ్దుల్ కరీం, భాగ్యమ్మ, మాధురి, ఉష, ఈశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు భూమి పూజ



గట్టు: మండల పరిధిలోని రాయాపురం గ్రామంలో బుధవారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ భూమి పూజలు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ. 15 లక్షల నిధులతో పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతగా, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాముడు, మాజీ ఎంపీటీసీ రంగస్వామి, రామకృష్ణారెడ్డి, పాగుంటప్ప, పెద్ద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని వారిపై చర్యలు

అయిజ: మున్సిపాలిటీలో పన్నులు చెల్లించనివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సిబ్బందితో కలిసి ఆస్తి, నల్లా పన్ను వసూలు చేశారు. మొత్తం అసిస్మెంట్లు 8051 ఉన్నాయని రూ. 1.69 కోట్లు ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా రూ.1.28 లక్షలు ఆస్తి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. నెలాఖరు వరకు ఆస్తిపన్ను చెల్లించనివారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు జారీ అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై కారు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ మురళీ, స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కోదండాపురానికి చెందిన చాకలి రాముడు జాతీయ రహదారిపై కూడలిలో రోడ్డును దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కారు అతివేగంతో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ధరూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



గట్టులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

మానవపాడు/ధరూరు/గట్టు: మానవపాడు మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలకు 186 మంది విద్యార్థులు హాజరైనట్లు సూపరింటెండెంట్ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

★ ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు 312 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూరింటెండెంట్ సత్యనారాయణ, అధికారి శేఖర్ తెలిపారు.

★ గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకుక 248 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కేఎస్‌డీ రాజు, డిపార్టుమెంటల్ అధికారి కాశీవిశ్వనాథ్ తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పెంచికలపాడులో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గట్టు: మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామంలో బుధవారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, జాగ్రత్తల గురించి ఏఎన్‌ఎం శాలమ్మ వివరించారు. గర్భిణుల్లో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారికి వైద్య పరీక్షలను అనంతరం 6 మాసాల పాటు ఉచితంగా భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అందిస్తుందని భవిష్యత్ భారత్ సీఓ హలీంపాష తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో వయస్సుకు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి, ఆహార పదార్థాలను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని కాశీపూర్, శింగవరం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జి.రాజు కోరారు. కాశీపూర్, శింగవరం గ్రామాల్లో ప్రజా సమస్యలపై బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ.. అలంపూర్ నుంచి టీజీ వెంకటేష్ ఫ్యాక్టరీ వరకు రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడ్డాయని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అంతర్గత రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు గ్యాస్ సబ్సిడీ డబ్బులు, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కాశీపూర్ గ్రామ వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడిగా తిరుపాలు, ప్రధాన కార్యదర్శి వెంకట్, కమిటీ సభ్యులు అజయ్‌కుమార్, అభిమన్యుడు, రామకృష్ణ, దేవమ్మ, నరసమ్మ, ఆదిలక్ష్మీ, సావిత్రమ్మ, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జయన్న, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందించాలి

– ఆనంద్‌శర్మపై రాజకీయ కుట్ర

గద్వాల: బ్రాహ్మణులకు సంక్షేమాభివృద్ధి పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శివరామాంజనేయ స్వామి దేవాలయం ఉత్తరాది మఠంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ.. అన్ని వర్గాలతో పాటుగా బ్రాహ్మణులకు సైతం సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపీ మల్లు రవిని కోరినట్లు తెలిపారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాసినట్లు తెలిపారు. వైదిక కార్యక్రమాలకు అన్ని సౌకర్యాలతో కూడిన వేదిక నిర్మాణానికి స్థలం కేటాయించాలని, అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలని సమావేశంలో మాట్లాడారు. అదే విధంగా రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠంగా ఉన్న అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా ఉన్న ఆనంద్‌శర్మపై దురుద్దేశంతో రాజకీయ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల ఆలయంలో పలు అవినీతికి పాల్పడుతూ లవ్ జీహాద్‌కు సహకరించిన ఓ ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు, సదరు ఉద్యోగే ఆనంద్‌శర్మపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. పక్క రాష్ట్రంలో సినిమా హాలులో ఎమ్మెల్యే ఫోటో తీసినట్లు ఆనంద్ శర్మపై కేసు పెట్టారని, దీనిపై ఆనంద్‌శర్మ క్షమాపణ కోరినప్పటికీ అక్రమంగా కేసులు పెట్టి వేధించడం సరైంది కాదన్నారు. పలువురు వ్యక్తులు, అర్చకులు, ధార్మిక సంఘాల ముసుగులు వేసుకుని ధర్నా చేస్తూ ఆలయానికి ఉన్న ప్రతిష్టకు భంగపరచడం భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. ఆనంద్‌శర్మపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టి అన్ని జిల్లాల నుంచి బ్రాహ్మణులు మద్దతుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంప్రసాద్, రఘునాథరావు, రఘువీర్‌శర్మ, భీంసేన్‌రావు, రాజశేఖర్‌శర్మ, శ్రీనివాస కౌండిన్య, గోపాలచార్యులు, శ్రీపతిజోషి, నరేష్, విశ్రాంత ఎంఈఓ మురళీకృష్ణ, సంజీవ్, హరి, నాగభూషణం, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో బ్రాహ్మణులు

మహాసభల వాల్‌పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న భవన నిర్మాణ రంగం సంఘ నాయకులు

అమరచింత: భవన, ఇతర నిర్మాణ రంగం కార్మిక సంఘం (టీయూసీఐ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించే రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు పట్టణంలోని మార్క్స్ భవనంలో బుధవారం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు వెంటనే పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుని నేటికి మూడేళ్లు అవుతున్నా ఇంత వరకు డబ్బులు మంజూరు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.5 వేల వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిలాని, రాజన్న, సామేలు, కురుమన్న, మన్నమని, సత్యనారాయణ, ప్రేమరత్నం, పాషా తదితరులు పాల్గొన్నారు.

'కవిత్వంలో రైతు కష్టం ప్రతిధ్వనించాలి'



వీరనాగుశతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: గ్రామీణ ప్రజలు, రైతుల కష్టాలను గౌరవించే విధంగా కవిత్వం ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బుద్ధారం ప్రాథమికోన్నత పాఠశాలలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిక్కొండ్ర రవి రచించిన 'వీరనాగు శతకం' అనే పుస్తకాన్ని మారం మల్లమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ చిక్కొండ్ర రవి చిన్న వయసులోనే పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వర్షంపై ఆధారపడే వ్యవసాయాన్ని చూసి చలించిపోయిన తాను భగీరథ ప్రయత్నంతో కృష్ణజలాలు తీసుకొచ్చి వనపర్తిని సస్యశ్యామలం చేసిన వైనాన్ని రవి పుస్తకంలో వివరించారని కొనియాడారు. వీరనాగు శతకం చరిత్రలో సామాజిక శతకంగా నిలిచిపోతుందని కొనియాడారు. కార్యక్రమంలో శిఖామణి, రచయిత సంధ్య, సిటీ కళాశాల తెలుగు శాఖ సంచాలకులు కోయి కోటేశ్వర్‌రావు, తెలంగాణ వికాసం సమితి అధ్యక్షుడు వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.